15న ఎంఎల్‌సిగా కవురు శ్రీనివాస్ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక సంస్థల కోటాలో శాసన మండలి సభ్యులుగా గెలుపొందిన జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ సోమవారం ఉదయం 10 గంటలకు విజయవాడ శాసనమండలి సభా ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. సోమవారం ఉదయం 7:00 గంటలకు పాలకొల్లు వైసిపి కార్యాలయం నుంచి భారీ ఊరేగింపుగా అమరావతి వెళతారు. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల నాయకులు, మహిళా నాయకులు, సర్పంచులు, ఎంపిటిసి, గ్రామ పార్టీ అధ్యక్షులు ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా..

ఇరగవరం నుంచి తణుకు వరకు చంద్రబాబు పాదయాత్ర
చంద్రబాబుకు సమస్యలు ఏకరువు పెట్టిన రైతులు
ధాన్యం రోడ్డుపై వేసి నిరసన తెలిపిన రైతులను అడ్డగించిన పోలీసులు
పోలీసుల తీరుకు నిరసనగా రోడ్డుపై బైటాయించిన మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి
కరెంటు స్తంభాలకు సంచులు కట్టి అన్నదాత నిరసన
మంత్రి కారుమూరిపై మండిపడిన చంద్రబాబు

పాదయాత్రలో చంద్రబాబు, టిడిపి నేతలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, భీమవరం, తణుకు రూరల్, తణుకు

రైతులకు ధైర్యం చెబుతూ.. అండగా ఉంటామని భరోసా ఇస్తూ ఇరగవరం నుంచి తణుకు వరకు చంద్రబాబు పాదయాత్ర శుక్రవారం సాగింది. ధాన్యం కొనుగోలు సమస్యలపై చంద్రన్న రైతు పోరుబాట పేరిట చంద్రబాబు పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా గురువారం సాయంత్రం ఇరగవరం చేరుకుని సెంటర్‌లో రైతులతో రచ్చబండ కార్యక్రమం నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గురువారం రాత్రి అక్కడే బస చేసిన చంద్రబాబు శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు తన పాదయాత్రను ప్రారంభించారు. ముందుగా ఇరగవరంలోని శ్రీ మద్ది ఆంజనేయ ఆలయం నుంచి తన పాదయాత్ర ప్రారంభించారు. ఇరగవరం నుంచి గొటేరు, గోపాలపురం, తణుకు మీదుగా తేతలి వై.జంక్షన్ దాదాపు 12 కిలోమీటర్ల మేర చంద్రబాబు పాదయాత్ర సాగింది. మార్గమధ్యంలో పొలాల్లోని రైతుల వద్దకు వెళ్లి మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. పడిపోయిన వరి చేనును, రైతులు తీసుకొచ్చిన వరి కంకులను, పనల మీద ఉన్న వరి చేలను చంద్రబాబు పరిశీలించి ప్రభుత్వంపై మండిపడ్డారు. అకాల వర్షాల వల్ల పంట చేతికందకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరూ అధైర్యపడవద్దని రైతులకు టిడిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ధాన్యం కొనుగోలు చేసి నష్టపరిహారం అందించాలని నేను ఇక్కడికి వస్తే వైసిపి అడుగడుగునా ఆంక్షలు సృష్టిస్తుందన్నారు. మిల్లర్లను పాదయాత్ర అనంతరం వై.జంక్షన్ సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రభుత్వం చంద్రబాబు తీవ్ర విమర్శలు గుప్పించారు. రాత్రి 8.30 గంటలకు చంద్రబాబు పర్యటన ముగిసింది. రైతులకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని, వరికి, మొక్కజొన్నకు రూ.25 వేలు, వాణిజ్య పంటలకు రూ.50 వేలు ఇవ్వాలని చంద్రబాబు డిమాండ్ చేశారు. వారం రోజుల్లో సమస్యలు పరిష్కరించకపోతే తాడేపల్లికి వచ్చి పోరాటం ఉధృతం చేస్తామన్నారు. తేమ, నూక, తూకం పేరుతో మిల్లర్లు వసూలు చేసిన డబ్బును రైతులకు వెంటనే తిరిగివ్వాలన్నారు. లేకపోతే టిడిపి ప్రభుత్వం ఇచ్చిన తర్వాత రైతులకు పరిహారం చెల్లిస్తుందన్నారు. సమస్యల పరిష్కారానికి రైతులంతా రోడ్లపైకి రావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. గోటేరుకు చెందిన రైతు నట్టి రాంబాబు నాలుగు ఎకరాలు, తిప్పరాల ముత్యాలరావు 1.70 ఎకరాల్లో సాగు చేసిన పంట తడిచిపోయిందన్నారు. రైతు రామరాజు మాట్లాడుతూ ఐదెకరాల ధాన్యం తడిచి ముద్దయిందన్నారు. రైస్‌మిల్లర్ దగ్గరకు తీసుకెళ్తే బస్తాకు రెండు కేజీలు ఎక్కువ తూస్తున్నారని చెప్పారు. సంచులు ఇవ్వడం లేదని, ఇచ్చిన సంచులు చిరిగిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు అన్నివిధాలా అండగా ఉండి ఆదుకుంటామన్నారు.

రోడ్డుపై బైటాయించిన మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి

చంద్రబాబు పర్యటన నేపథ్యంలో చంద్రబాబుకు చూపించేందుకు రైతులు ధాన్యన్ని రోడ్డుపైకి తీసుకురాగా పోలీసులు అడ్డుకున్నారు. ధాన్యం ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో రైతులతో కలిసి తణుకు మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. పోలీసులు ధాన్యం ట్రాక్టర్లను విడిచిపెట్టడంతో సమస్య సద్దుమణిగింది.

వరి చేలో నడిచిన చంద్రబాబు

రైతు సమస్యల పట్ల ప్రభుత్వం అవలంభిస్తున్న వ్యతిరేకతను నిరసిస్తూ చంద్రబాబు వరి చేలో పాదయాత్ర సాగించారు. గోపాలపురం దాటిన తర్వాత చంద్రబాబు వరి చేలో నడిచారు. ప్రభుత్వం తక్షణం రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మంత్రి కారుమూరిపై మండిపాటు

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు రైతులను ఎర్రి.. అంటూ విమర్శించడమే కాకుండా దానికి బుజ్జి నాన్న అంటూ అర్థం చెప్పారన్నారు. మొదటి ఎర్రి.. తాడేపల్లిలోనూ, రెండో ఎర్రి.. తణుకులోనూ ఉన్నాడంటూ ఎద్దేవా చేశారు. రైతులను అవమానించిన మంత్రిని డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు. సిఎంకు నీతి నిజాయితీ ఉంటే ఈ పని వెంటనే చేయాలన్నారు. చేతగాని మంత్రి అంటూ దమ్ముంటే తణుకు నియోజకవర్గంలో ధాన్యం కొనాలన్నారు. నేను వస్తే ఫ్లెక్సీలు కడతావా.. నీ ఇంట్లో పెళ్లా, తద్దినమా అంటూ విమర్శించారు. మంత్రి తలుచుకుంటే నేను తణుకు దాటలేరని చెబుతున్నారని, అమ్మో నాకు భయమేస్తోంది.. నిద్ర రావడం లేదంటూ ఎగతాళిగా మాట్లాడారు. 45 ఏళ్లు రాజకీయాల్లో ఉన్నానని, ముఠా రాజకీయాలను అణిచివేసిన పార్టీ టిడిపి అని అన్నారు. వైసిపి నాయకులు రౌడీయిజం చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ వదలబోమన్నారు. బాంబులకే భయపడలేదని, తాటాకు చప్పుళ్లకు కుందేళ్లు బెదురుతాయా అని అన్నారు. నోరు పారేసుకోవద్దు. అంటూ మంత్రి కారుమూరిని హెచ్చరించారు. కౌలు రైతులను అన్నివిధాలా ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు రైతుల సమస్యలపై మాట్లాడారు. మాజీ మంత్రులు పితాని సత్యనారాయణ, పీతల సుజాత, పత్తిపాటి పుల్లారావు, జవహర్, దేవినేని ఉమా, జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, ఎంఎల్ఎలు నిమ్మల రామానాయుడు, మంతెన రామరాజు, మాజీ ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు, తూర్పుగోదావరి జిల్లా నాయకులు, జిల్లా ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

గోడు వెళ్లబోసుకున్న రైతులు

చంద్రబాబు పాదయాత్రలో రైతులు సమస్యల గోడు వినిపించారు. ఇరగవరానికి చెందిన రైతు కోడెల మోహన్‌రావుకు చెందిన రెండెకరాల వరిపొలాన్ని చంద్రబాబు పరిశీలించిన సందర్భంలో మోహన్‌రావు అనేక సమస్యలు విన్నవించారు. అకాల వర్షానికి పంట మొత్తం నేలమట్టమైందని ఆవేదన వ్యక్తం చేశారు. గణేష్‌రావు, ముత్యాల నాగేశ్వరరావు చెందిన ఎనిమిదెకరాల ధాన్యాన్ని చంద్రబాబు పరిశీలించారు. ధాన్యం మొత్తం తడిచిపోయిందని, మొలకలు వచ్చాయని కొనుగోలుకు ఎవరూ ముందుకు రావట్లేదని చంద్రబాబు దృష్టికి తీసుకొచ్చారు. అర్జునుడుపాలెంకు చెందిన రైతు పి.శ్రీనివాస్ నాలగెకరాల్లో వ్యవసాయం చేశానని మొలకలు వచ్చిన ధాన్యాన్ని చంద్రబాబుకు చూపించారు. గొటేరుకు చెందిన ఇందుకూరి రామరాజు మాట్లాడుతూ ఐదెకరాల ధాన్యం మొత్తం తడిచి ముద్దయ్యిందన్నారు. ఇచ్చిన సంచులు కూడా చిరిగిపోయాయన్నారు.

బైటాయించిన ఆరిమిల్లితో పోలీసుల మంతనాలు

మొలకలొచ్చిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న చంద్రబాబు

వరిచేలో చంద్రబాబు


రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను సత్కరిస్తున్న వైస్ ఛాన్సలర్ జానకిరామ్

ఉద్యాన ఉత్పత్తుల్లో ఎపిది రెండో స్థానం

ఉద్యాన యూనివర్సిటీ ఐదో స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వ్యవసాయం, ఉద్యాన రంగాల ఉత్పత్తిలో మన రాష్ట్రం రెండో స్థానంలో ఉందని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. శుక్రవారం వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం 5వ స్నాతకోత్సవ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఆర్థిక సూపర్ పవర్‌గా భారతదేశం ఎదుగుతోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న జనాభా రీత్యా భవిష్యత్‌లో పోషకాహార భద్రత మరింత ఎక్కువ ప్రాముఖ్యతను సంతరించుకోనుందన్నారు. ఉద్యానవన ఉత్పత్తి ఇప్పటికే దేశంలోని వ్యవసాయోత్పత్తిని అధిగమించిందని, ఇది స్థూల జాతీయోత్పత్తిలో ఆరు శాతంగా ఉండటం శుభపరిణామమన్నారు. ఉద్యాన రంగం 14 శాతం ఉపాధి అవకాశాలను సృష్టిస్తోందని, అందులో 12 శాతం మహిళలకే కావడం గొప్ప విషయమని అన్నారు. కొన్ని దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్‌లో అద్భుతమైన ఉద్యానవన వృద్ధిని సాధించామని, ఉద్యానవనాన్ని రాష్ట్రంలో సూర్యోదయ రంగంగా గుర్తించామని, 17.84 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో 312.34 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తితో దేశంలోనే రెండో స్థానంలో ఉందని ఆయన స్పష్టం చేశారు. ఉద్యానవన ఉత్పత్తిలో ఇన్‌పుట్ వినియోగ సామర్థ్యాన్ని పెంచడానికి రోబోటెక్ టెక్నాలజీలు, డ్రోన్ల రూపకల్పన, ఉపయోగం వంటి సరిహద్దు సాంకేతికతలతో విశ్వవిద్యాలయం కూడా ముందుకు సాగడం హర్షణీయమన్నారు. ప్రతిభ కనబరిచిన శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, విద్యార్థులకు అవార్డులు, బంగారు పతకాలను అందించారు. స్నాతకోత్సవంలో డిగ్రీలు పొందిన విద్యార్థులందరినీ గవర్నర్ అభినందించారు. ఉద్యాన రంగాన్ని కెరీర్‌గా ఎంచుకున్నందుకు వారిని ప్రత్యేకంగా ప్రశంసించారు. ముఖ్యఅతిథి నీతి ఆయోగ్ సభ్యుడు, ప్రఖ్యాత వ్యవసాయ ఆర్థికవేత్త ప్రొఫెసర్ డాక్టర్ రమేష్‌చంద్ తొలుత స్నాతకోపన్యాసం చేశారు. ఉద్యానవన విద్యలో ఉత్తమ ఫలితాలు పొంది డిగ్రీలు సాధించిన విద్యార్థులు జాతీయ స్థాయిలో రైతులకు ఉపయోగపడే నూతన ఆవిష్కరణలు చేయాలని సూచించారు. ప్రభుత్వాలు అందిస్తున్న విద్యా వనరులను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యావకాశాలు సాధించాలన్నారు. అన్ని రకాల వాతావరణాలను తట్టుకునే విధంగా రైతులకు ఉపయోగపడే మేలైన వ్యవసాయ, ఉద్యాన వంగడాలను సృష్టించేందుకు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. నూతన విత్తనాలతోపాటు నాణ్యమైన ఉత్పత్తులు పొందేందుకు అవసరమైన సేంద్రియ ఎరువులను వాడేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందేలా రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందించాలన్నారు. మారుతున్న వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఉండేందుకు ఉద్యాన పంటలు వేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ, ఉద్యాన పంటల అభివృద్ధికి రైతులకు కావల్సిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తుందని తెలిపారు. అధిక దిగుబడుల పేరుతో క్రిమిసంహారక మందులు వాడటం వల్ల వాతావరణంలో పెనుమార్పులు కలుగుతున్నాయన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ తోలేటి జానకిరామ్ గవర్నర్‌కు మెమెంటోను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, యూనివర్సిటీ బోర్డు మెంబర్లు, విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ సూర్యతేజ

ధాన్యం సేకరణలో ఇబ్బంది లేకుండా చూడాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ సూచించారు. శుక్రవారం రామన్నపాలెం-2వ సచివాలయాన్ని సందర్శించి ధాన్యం రికార్డులు పరిశీలించారు. రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ధాన్యం సేకరణ వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట అనిల్ కుమారి, తహశీల్దార్ జి.అనిత కుమారి ఉన్నారు.

ఉపాధి కూలి పెంపులో కేంద్రం నిర్లక్ష్యం

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు



ధర్నాలో కూర్చున్న వ్యవసాయ కార్మికులు, నేతలు

ప్రజాశక్తి - భీమవరం

పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీ రూ.600కు పెంచడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద ఉపాధి హామీ కూలీలతో ధర్నా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వ్యవసాయ కార్మికులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి అధ్యక్షత వహించారు. రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత 80 కోట్ల మంది పేదల కంటే వంద కుటుంబాల కార్పొరేట్ల ఆదాయం పెంపే లక్ష్యంగా పని చేస్తున్నాడని విమర్శించారు. పేద, మధ్యతరగతి ప్రజల నడ్డి విరిచే కేంద్ర ప్రభుత్వ విధానాలను సిఎం జగన్ సమర్థిస్తున్నారని, ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా ఉపాధి హామీ నుండి తొలగించిన సౌకర్యాలను, సమ్మర్ అలవెన్స్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు కౌరు పెద్దిరాజు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ, ఆక్వా సాగు, ఇతర రాష్ట్రాల కూలీలు వచ్చిన తర్వాత ఉపాధి తగ్గిందన్నారు. ఈ క్రమంలో గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు పట్టెడన్నం పెడుతున్న ఉపాధి హామీని నిర్వీరం చేస్తే ఉపాధి హామీ కూలీలు మీ గురించి ఆలోచించాల్సి వస్తుందని హెచ్చరించారు. మున్సిపాల్టీల్లో విలీనం చేసిన గ్రామాల్లో ఉపాధి పనులు నిలిపివేయడం వల్ల కూలీలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, వెంటనే పునరుద్ధరించాలని, లేనిపక్షంలో మున్సిపాల్టీ వద్ద ధర్నా చేపడతామని హెచ్చరించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.600 ఇవ్వాలని, రెండొందల రోజులు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ అధికారం చేపట్టిన తర్వాత కార్మికులు, కర్షకులు పోరాడి సాధించుకున్న హక్కులను హరించి కార్పొరేట్లకు ఎర్రతివాచీ పరుస్తున్నారని, రానున్న రోజుల్లో ఐక్య పోరాటాలు నిర్వహించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. అనంతరం ధర్నా శిబిరం నుండి వినతిపత్రం అందించేందుకు కలెక్టరేట్లోకి వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో నాయకులు, పోలీసులు మధ్య కొద్దిసేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. అనంతరం 11 మందితో కూడిన బృందాన్ని అనుమతించడంతో కలెక్టరేట్లోకి వెళ్లి డిఆర్ఒ, డ్వామా ఎపిడీలకు సమస్యలతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నేతలు బల్ల చినవీరభద్రరావు, కండెల్లి సోమరాజు, జక్కంశెట్టి వెంకటలక్ష్మి, శేషపు అశ్రియ్య, యడ్ల చిట్టిబాబు, షేక్ బాదుషా, మూడే మోజేష్, సోడదాసి సంజీవరావు, బొప్పనపల్లి సూర్యసుందర్రావు, కండెల్లి రమేష్‌బాబు, సుందరమ్మ, ప్రజాసంఘాల నాయకులు పెచ్చెట్టి నరసింహమూర్తి, ఇంజేటి శ్రీనివాస్, పిల్లి కామేశ్వరరావు, పాలుపూరి సత్యనారాయణ, వేంద్ర రామకృష్ణ పాల్గొన్నారు.

సంచుల కొరత లేదనడం హాస్యాస్పదం

రైతులతో మాట్లాడుతున్న సుబ్బరాజు

ప్రజాశక్తి - పెనుమంట్ర

సమస్య లేనిచోట కలెక్టర్ వెళ్లి పరిశీలించి గోనె సంచుల కొరత లేదని చెప్పడం పట్ల కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.సుబ్బరాజు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం ఓడూరులో కౌలు రైతుల సంఘం బృందం పర్యటించి రైతులతో మాట్లాడారు. ఇటీవల కలెక్టర్ మార్టేరు ఆర్‌బికెకు వెళ్లి గోనె సంచుల కొరత లేదని చెప్పడం హాస్యాస్పదమన్నారు. అధికారులు సమస్య ఉన్న చోట కాకుండా లేనిచోటకు వెళ్లి పరిశీలిస్తున్నారని తెలిపారు. తాము క్షేత్రస్థాయిలో పరిశీలించిన తరువాత సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు గురించామని తెలిపారు. క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు పరిశీలించాలని తెలిపారు. పలు ఆర్‌బికెల్లో వ్యవసాయ అధికారులు లేకపోవడం దురదృష్టకరమన్నారు. జుత్తిగ నుంచి రాయకుదురులోని ఓ రైస్ మిల్లుకు ధాన్యం వెళ్లిన సందర్భంలో నూక శాతం ఎక్కువగా ఉందని సంబంధిత ట్రాక్టర్ డ్రైవర్‌ను, కౌలు రైతును ఇబ్బందికి గురిచేశారని తెలిపారు. తాము టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇచ్చి సమస్యను పరిష్కరించామని తెలిపారు.

ప్రగతి రథసారథులు విద్యార్థులు

నిట్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి సందీప్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

దేశ ప్రగతి రథసారథులు విద్యార్థులేనని ఎపి నిట్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ వి.సందీప్ సూచించారు. నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్‌పడోలే ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని పురస్కరించుకుని 'ఇన్నోవేషన్ ఇన్‌సైన్స్ పర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైర్డ్ రీసెర్చ్' అంశంపై రెండు రోజులుగా నిర్వహిస్తున్న వర్క్ షాప్ శుక్రవారం సాయంత్రం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సందీప్ మాట్లాడుతూ విద్యార్థుల నూతన ఆవిష్కరణలు ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేలా ఉండాలన్నారు. ఏదైనా సాధించాలనే సంకల్పం, పట్టుదల, కృషి ఉండాలన్నారు. అప్పుడే విజయశిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. ప్రతి విద్యార్థీ ప్రాథమిక స్థాయి నుంచి స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమేటిక్స్) కోర్స్‌లపై పట్టు సాధించి తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని వివరించారు. ఫ్యాకల్టీ సభ్యులు ఎస్‌సిఇఆర్‌టి డి.డేవిడ్, డాక్టర్ మహ్మద్‌గౌస్ మాట్లాడారు. విద్యార్థుల ఆవిష్కరణలను నిట్ ఆచార్యుల బృందం క్షుణ్ణంగా పరిశీలించటంతోపాటు ఆయా ప్రాజెక్టులను సమాజ అవసరాలకు అనుగుణంగా మరిన్ని మెరుగులు దిద్దడానికి అవసరమైన సలహాలు, సూచనలు అందజేయడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం 35 మంది విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. ముందుగా విద్యార్థులు ప్రాంగణంలోని ఇండోర్ స్టేడియం, ప్రయోగశాలలు, గ్రంథాలయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్లు నభజిత్ భచర్, స్వరాజ్, ఆచార్యులు శంకర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సందీప్

సిపిఐ నేతల అరెస్టు అన్యాయం

ప్రజాశక్తి - ఉండి

అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ సిపిఐ, రైతు సంఘాలు చేపట్టిన చలో ముఖ్యమంత్రి కార్యాలయం ముట్టడిని పోలీసులు భగ్నం చేశారు. మంగళగిరి సిపిఐ ఆఫీసు వద్ద ఉండి సిపిఐ నాయకులను పోలీసులు అరెస్టు చేసి దుగ్గిరాల పోలీసు స్టేషన్‌కు తరలించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కోణాల భీమారావు, ఉండి ఏరియా కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రైతుల కోసం పోరాడుతున్న సిపిఐ నాయకుల అక్రమ అరెస్టులు అన్యాయమన్నారు. అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. నష్టపోయిన ప్రతి ఎకరాకూ 30 వేల రూపాయల నష్టపరిహారాన్ని అందించాలని వారు డిమాండ్ చేశారు. ఉండి నుండి వెళ్లిన వారిలో జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.సీతారాం ప్రసాద్, పున్నాని వెంకట అప్పారావు, కర్రి సూరిబాబు, పడాల శ్రీనివాస్, నరసింహరాజు ఉన్నారు.

ఐటిఐలో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - ఆచంట

ఆచంటలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటిఐ)లో 2023-2024 విద్యా సంవత్సరానికి గాను మొదటి విడత కౌన్సెలింగ్‌కు iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఇందుకూరి వెంకట సత్యనారాయణ రాజు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఐటిఐ ఆచంటలో చేయాలనుకునే విద్యార్థులు ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ పోర్టల్‌లో దరఖాస్తు చేసిన ప్రింట్ కాపీని, ధ్రువపత్రాల నకళ్లను జూన్ 6వ తేదీ మంగళవారం సాయంత్రం ఐదు గంటల్లోపు ఐటిఐ కాలేజీలో అందించాలని తెలిపారు. కౌన్సెలింగ్ వివరాలు త్వరలో తెలియపరుస్తామని, మరిన్ని వివరాలకు 9490111002 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఆర్ అండ్ ఎసి మెకానిక్, మోటార్ మెకానిక్, డ్రాఫ్ట్స్ మాన్ సివిల్ కోర్సులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.


పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఇఒ శారదా జ్యోత్స్న

పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

రాబోయే ఆర్థిక సంవత్సరంలో విద్యార్థులకు సరిపడా పుస్తకాలు, యూనిఫారాలు వచ్చాయని ఎంఇఒ డి.శారదా జ్యోత్స్న తెలిపారు. శుక్రవారం బ్రాహ్మణచెరువు ఎంఇఒ కార్యాలయంలో విద్యార్థులకు సరిపడా పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలను ఆయా పాఠశాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ 12,162 పాఠ్య పుస్తకాలు, 234 డిక్షనరీలో వచ్చాయన్నారు. అంతేకాకుండా 1959 మంది బాలురకు, 1839 మంది బాలికలకు మొత్తం 3,797 మందికి మూడు జతలు చొప్పున యూనిఫామ్ ఇప్పటికే వచ్చినట్లు తెలిపారు. వాటిని ఆయా పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిలు, పిఐటిలు పాల్గొన్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

పుట్టెడు కష్టాల్లో ఉన్న కౌలు రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం రైస్ మిల్లర్లకు తలొగ్గి నూకశాతం కింద ప్రతి సారబస్తాకు కేజీ అదనంగా ఇవ్వాలని నిర్ణయించటం దారుణమని కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు విమర్శించారు. ధాన్యం కొనుగోలు సమస్యలపై పోడూరు, పాలకొల్లు మండలంలోని జిన్నూరు, పెచ్చెట్టిపాలెం, ఆగర్రు, భగ్గేశ్వరం, సత్యనారాయణపురం గ్రామాల్లో పర్యటించామన్నారు. ఈ సందర్భంగా ఆయన పాలకొల్లులో మీడియాతో మాట్లాడుతూ నూక, తేమశాతం పేరుతో మిల్లర్లు రైతులను మోసం చేస్తుంటే అడ్డుకోవాల్సిన అధికారులు క్వింటాకు 2 కేజీలు ఇవ్వాలని నిర్ణయించడం దారుణమన్నారు. క్వింటాల్‌కు 3 సారబస్తాలు పట్టాల్సి వస్తోందని సారబస్తాకి కేజీ చొప్పున 3 కేజీలకు రైతు క్వింటాల్‌కు 60 రూపాయలు నష్టపోతున్నారని, మిల్లర్ల దోపిడీకి, దీనికి తేడాలేదని అన్నారు. ఈ పర్యటనలో కౌలు రైతులు పెచ్చెట్టి వెంకట సత్యనారాయణ, కుక్కల గణేష్, కోలాటి నాగేశ్వరరావు, పెచ్చెట్టి సుబ్బారావు, మల్లుల సత్యనారాయణ, మాదు వీరరాఘవులు, కట్టా ఆంజనేయులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

సర్పంచి కనకదుర్గ వెంకటాచార్యులు

ప్రజాశక్తి - ఉండి

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామ సర్పంచి సూరవరపు కనకదుర్గ వెంకటాచార్యులు అన్నారు. శుక్రవారం గ్రామంలోని నీటి బావులను పూడిక తీయించి శుభ్రం చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలోని ప్రజల దాహార్తిని తీర్చడానికి ఇప్పటికే పలు చేతి, బోరు పంపులకు మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. పబ్లిక్ కొళాయిల వద్ద విరిగిపోయిన ట్యాప్‌ల స్థానంలో కొత్త ట్యాపులు బిగించడం జరిగిందని, ఇప్పుడు నీటి బావుల్లోని పూడిక తీయించి శుభ్రం చేయించినట్లు తెలిపారు. ఉప సర్పంచి కడలి సత్యనారాయణ, ఎంపిటిసి మున్నలూరి సువర్ణ లక్ష్మి శ్రీనివాస్, బోర్డు సభ్యులు దగ్గరుండి నీటి బావుల్లోని పూడికను తీయించారు.

వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు

వేసవి విజ్ఞాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు విద్యా, చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు ఉత్సాహంగా, ఆసక్తితో పాల్గొంటున్నారు. ఈ ఉచిత శిక్షణలో విద్యార్థులకు భౌతిక, రసాయన, జీవశాస్త్రాలకు సంబంధించిన ప్రయోగాలను ఉపాధ్యాయులు చేసి చూపించి అవగాహన కల్పిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రతిరోజు 50 మంది విద్యార్థులు ఈ శిక్షణకు హాజరవుతున్నారని సమాఖ్య కార్యదర్శి పోలిశెట్టి శ్రీశ్రీ చెప్పారు. ఈ శిక్షణను ప్రముఖ భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు చినమిల్లి వెంకట్రావు, మేడిశెట్టి వెంకట గణేష్, జీవ శాస్త్రానికి సంబంధించి పడవల బాలరాజు విద్యార్థులకు ప్రయోగాలను చక్కగా చేసి వివరిస్తున్నారు. పోటీ పరీక్షలకు ఉపయోగపడే మెంటల్ ఎబిలిటీని కొంతేటి ఫణి కుమార్ బోధిస్తున్నారు. ఈ ఉచిత శిక్షణ ఈ నెల 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి 11 గంటల వరకు ఎంఎంకెఎన్ఎం మున్సిపల్ హైస్కూల్ ఈ శిక్షణ నిర్వహించనున్నట్లు చెప్పారు.

నేరాలు - ఘోరాలు

కుమార్తె కనిపించడంలేదని తల్లి ఫిర్యాదు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఈశ్వరి దుర్గ

తమ కుమార్తె కనిపించడంలేదని తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని గవరపేట గ్రామానికి చెందిన పెంట కోటి ఈశ్వరి దుర్గ ఉల్లంపర్రు నర్సింగ్ కాలేజీలో చదువుతుంది. ఆమెకు గవరపేటకుకు చెందిన పెంటకోటి సాంబమూర్తితో 2017లో వివాహమైంది. వీరికి ఒక పాప ఉంది. సాంబమూర్తి సంవత్సరం క్రితం ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లారు. ఈశ్వరి దుర్గ నర్సింగ్ కాలేజీలో శిక్షణ పొందుతోంది. ఈ క్రమంలో ఈ నెల ఐదో తేదీన ఇంట్లో కాలేజీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు అన్ని చోట్ల వెతికినా ఎక్కడా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో దుర్గ తల్లి కృష్ణవేణి పాలకొల్లు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

తాటి ముంజులకు గిరాకీ..

కొనేందుకు ఆసక్తి చూపుతున్న కొనుగోలుదారులు

ప్రజాశక్తి - కాళ్ల

వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు జ్యూస్‌లు, శీతల పానీయాలు ఏ మేరకు మేలు చేస్తాయో చెప్పలేం గానీ వేసవిలో మాత్రమే లభించే కూల్ కూల్ తాటి ముంజలు మాత్రం ఆరోగ్యంతో పాటు చల్లదనాన్ని ఇస్తాయనడంలో సందేహం లేదు. ప్రకృతి వరప్రసాదమైన తాటిముంజలను ఐస్ యాపిల్‌గా పిలుస్తుంటారు. ఎండాకాలంలో మాత్రమే లభించే ఈ ముంజలు శరీరానికి ఎంతో మేలు చేస్తాయని, కేలరీలు, విటమిన్లు అధికంగా ఉన్న ముంజలను తినడం ఆరోగ్యానికి శ్రేయస్కరమని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో చాలా చోట్ల తాటి ముంజలను విక్రయిస్తున్నారు. ఇవి వేసవి తాపం నుంచి ఉపశమనాన్ని ఇవ్వడమే కాదు, ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. శరీరంపై వచ్చే చిన్నచిన్న మొటిమలను నివారించడంలో ఉపకరిస్తాయి. శరీరానికి మినరల్స్ అందిస్తాయి. షుగర్ కంటెంట్ తక్కువగా ఉన్న ముంజలను ఏ వయస్సు వారైనా తినొచ్చు. ఇవి డీహైడ్రేషన్ నుంచి కాపాడతాయి. జిల్లాలో గ్రామీణ ప్రాంతాల నుంచి తాటి ముంజలను సేకరించే రైతులు పట్టణాలకు తెచ్చి విక్రయిస్తున్నారు. తెల్లవారుజామునే తాటిచెట్ల నుంచి ముంజలను సేకరించి పలు మండల కేంద్రాల్లో విక్రయిస్తున్నారు.

తాటి ముంజలను విక్రయిస్తున్న వ్యాపారి

తాటి ముంజలకు గిరాకీ..

మండలంలోని కాళ్ల, ఏలూరుపాడు, సీసలి, జక్కరం, కోపల్లె, పెదఅమిరం వంటి ప్రధాన కూడళ్లలో వీటిని విక్రయిస్తున్నారు. వేసవి మూడు నెలలు మాత్రమే పరిమితంగా లభించే తాటిమంజలను విక్రయిస్తూ పలువురు ఉపాధి పొందుతున్నారు. డజన్ తాటి ముంజలను రూ.70 నుంచి రూ.వంద వరకూ విక్రయిస్తున్నారు. వీటిని కొనుగోలు చేసేందుకు కొనుగోలుదారులు ఆసక్తి చూపుతున్నారు. వ్యవసాయ పనులు తక్కువగా ఉండే వేసవిలో తాటి ముంజుల విక్రయాలు కాస్తంత ఊరటనిస్తోందని తాటిముంజల వ్యాపారులు అంటున్నారు. అయితే ఇటీవల పెరిగిన పెట్రోల్ రేట్ల వల్ల ముంజుల విక్రయాలు అంత లాభసాటిగా లేవని అంటున్నారు. తెల్లవారు జామున లేచి సాయంత్రం వరకు అమ్మకం జరిగితే కూలి డబ్బులు మాత్రమే గిట్టుబాటు అవుతుందని వాపోతున్నారు.

అర్ధవరంలో ఫ్రైడే డ్రైడే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి - గణపవరం

ఇంటి పరిసరాల్లో మురుగు నీరు లేకుండా చూసుకుని దోమలు నివారణకు కృషి చేయాలని గణపవరం పిహెచ్‌సి డాక్టర్లు పి.సంతోషనాయుడు, పి.కిరణ్మయి అన్నారు. శుక్రవారం అర్ధవరంలో జరిగిన ఫ్రైడే డ్రైడేలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటి ఆవరణలో పనికిరాని టైర్లు, పూలకుండీలు లేకుండా చూసుకోవాలన్నారు. మురుగునీరు ఉంటే దోమలు చేరడానికి అవకాశం ఉంటుందన్నారు. ఫ్రైడే డ్రైడే పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఎస్.దివ్యజ్యోతి, హెల్త్ అసిస్టెంట్ బి.రవికుమార్ పాల్గొన్నారు.

పదిలో ప్రతిభ విద్యార్థులకు సత్కారం

ప్రజాశక్తి - భీమవరంరూరల్

ఆదిత్య స్కూల్లో పది ఫలితాల్లో అద్భుత విజయం సాధించిన విద్యార్థులకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన జిఎస్‌డిఎస్ మేఘన, బిహెచ్ఎస్ చైతన్య వర్మ, ఎన్.నవ్య, హౌసింగ్ బోర్డు బ్రాంచ్ నుండి సిహెచ్ నీలా సంజీవని, జె.మధుహాసిని, కె.పాల్ సుధాకర్‌ను స్కూల్ డైరెక్టరు లయన్, ఆదిత్య కృష్ణంరాజు సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవితంలో సాధించిన మొట్టమొదటి విజయానికి గుర్తింపునిస్తూ వారి జీవితాంతం గుర్తుండేలా మరిన్ని విజయాలు సాధించడానికి ప్రోత్సాహంగా చిరు సన్మానం చేశామన్నారు. స్కూలు ప్రిన్సిపల్ టి.శ్రీనివాస్ మాట్లాడుతూ తాము 26 ఏళ్లుగా అత్యుత్తమ విద్యనందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ బోర్డు కాలనీ బ్రాంచి ప్రిన్సిపల్ కెవి.సత్యనారయణ, బి.యుగసుధ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాళ్ల : పదో తరగతి విద్యార్థులకు పురస్కారాలు అందించి సత్కరించిన యాజమాన్యం

కాళ్ల : మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల పది పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబర్చారని ఎంపిపి పి.శిరీష విశ్వనాధరాజు అన్నారు. కోపల్లె హైస్కూల్లో శుక్రవారం ఆయా విద్యార్థులను సత్కరించారు. పిల్లలకు చక్కని ప్రోత్సాహం ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇంత చక్కని కార్యక్రమం ఏర్పాటు చేసిన యుటిఎఫ్ మండల శాఖకు ఎంఇఒ ఎ.రవీంద్ర శుభాకాంక్షలు తెలిపారు. యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో పదో తరగతిలో ప్రతిభ సాధించిన విద్యార్థులను సత్కరించి పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పి.విశ్వనాథరాజు ఆర్థిక సహకారంతో విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి విలువైన ఇంగ్లీష్ గ్రామర్ పుస్తకాలు అందజేశారు. కె.భవానీప్రసాద్ ఆర్థిక సహకారంతో మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, ప్రధాన కార్యదర్శి ఎకె.వి.రామభద్రం, కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య, కార్యదర్శులు జి.రామకృష్ణంరాజు, పి.క్రాంతికుమార్‌లు పాల్గొన్నారు.

హామీ అమలు చేయకపోవడం బాధాకరం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

గత విద్యా సంవత్సరంలో ప్రమోషన్ పేరిట విల్లింగ్ తీసుకుని స్కూల్ అసిస్టెంట్‌గా నియమించిన ఉపాధ్యాయులకు నెలకు రూ.2,500 చొప్పున ఇస్తానని చెప్పి (జనవరి నుంచి ఏప్రిల్) ఇవ్వకపోవడం బాధాకరమని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జి.ప్రకాశం అన్నారు. ఈ విధంగా విల్లింగ్ ఇచ్చి ప్రమోషన్‌కు వెళ్లిన ఉపాధ్యాయులు తాము సెకండరీ గ్రేడ్ టీచర్లమా లేక స్కూల్ అసిస్టెంట్లమా అన్నది తేల్చుకోలేని పరిస్థితుల్లో టీచర్లు ఉన్నారన్నారు. భీమవరంలో శుక్రవారం జరిగిన మండల శాఖ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైస్కూల్ ప్లస్ స్కూల్స్‌లో రెగ్యులర్ ప్రమోషన్ కాకుండా ఒక ఇంక్రిమెంట్ ఇచ్చి నియమించడాన్ని ఆయన తప్పుపట్టారు. కేడర్ మార్చకుండా రెగ్యులర్ ప్రమోషన్ ఇవ్వకుండా చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కుమార్, ఉపాధ్యక్షులు యోసేపు, రాంబాబు, విజయకుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ప్రకాశం

ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ అద్దాల ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ నర్సుల సేవలు ఎనలేనివి, వెలకట్టలేనివని అన్నారు. కరోనా సమయంలో నర్సులు చేసిన సేవలను ప్రతిఒక్కరూ ప్రశంసించారన్నారు. అనంతరం నైటింగేల్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ జీవిత చరిత్ర గురించి ప్రతిఒక్కరూ గుర్తు చేసుకుని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నవ్య జీవన్, డాక్టర్ భవానీప్రసాద్, ఆరోగ్య విస్తరణ అధికారులు గుడాల హరిబాబు, కె.ప్రభాకర్, హెచ్ఎన్ పి.ఎలిజిబెత్, సీనియర్ అసిస్టెంట్ చేబోలు శ్రీనివాస్, ఫార్మసిస్ట్ పివి.స్వామి, స్టాఫ్ నర్సులు సుజాత, సౌజన్య, ముత్యవల్లి, సూపర్‌వైజర్లు ఎస్‌కె అమలేశ్వరరావు, నారాయణమూర్తి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్‌లో...

గణపవరం : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి డాక్టర్ కె.ప్రియాంక మాట్లాడుతూ రోగులకు సేవలందించిన నైటింగేల్ జీవితాన్ని ప్రతి నర్సు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు

కొల్లేరు సమస్యలు పరిష్కరించండి

ఎంఎల్‌సి జయమంగళ

ప్రజాశక్తి - కైకలూరు

కొల్లేరు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని శాసనమండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ కోరారు. శుక్రవారం ఆయన తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో వైసిపి రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ మిధున్‌రెడ్డికి కొల్లేరు సమస్యలను వివరించారు. కైకలూరు నియోజకవర్గంలో రైతులు, కొల్లేరు ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ సమక్షంలో వినతిపత్రం అందజేశారు. రైతులు వారి స్వాధీనం, అనుభవంలో ఉన్న భూములకు హక్కు కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు నిబంధనకు లోబడి కొల్లేరు ప్రాంత గ్రామాల్లో మంచినీటి చెరువులు, పశువులు తాగేందుకు చెరువులు ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం కల్పించాలన్నారు. సుప్రీంకోర్టు నిబంధనలకు లోబడి వచ్చే వర్షాకాలంలోపు గ్రామాల్లో స్వాధీనం చేసుకోవాల్సిన భూమి కంటే ఎక్కువ భూమిని స్వాధీనం చేసుకున్న భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. వచ్చే వారంలో ఫారెస్ట్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు.


మిధున్‌రెడ్డితో ఎంపీ శ్రీధర్‌బాబు, జయమంగళ

జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

బైక్‌ను ఢీకొట్టిన కారు
రిటైర్డ్ వెటర్నరీ అసిస్టెంట్ మృతి
కారు ఎంపీ భరత్‌రామ్‌దిగా ప్రచారం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్


నరసయ్య (ఫైల్)

16వ నెంబరు జాతీయ రహదారిపై శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. జాతీయ రహదారిని దాటుతున్న సమయంలో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో భీమడోలుకు చెందిన రిటైర్డ్ వెటర్నరీ అసిస్టెంట్ శృంగవృక్షం నరసయ్య (65) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరామవరానికి చెందిన నరసయ్య కొన్నేళ్ల నుంచి భీమడోలులో ఉంటున్నారు. ఆయనకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇరువురికి వివాహాలు అయ్యాయి. నరసయ్య వ్యక్తిగత పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం భీమడోలు నుంచి బైక్‌పై సీతంపేట బయలుదేరారు. ఈ క్రమంలో దెందులూరు మండలంలోని కొత్తగూడెం రహదారి వద్ద రోడ్డు దాటుతుండగా విజయవాడ వైపు నుంచి రాజమండ్రి వైపుగా వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరసయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన మృతితో భీమడోలు, శ్రీరామవరం గ్రామాల్లో విషాదచాయలు అలుముకున్నాయి.

కారు ఎంపీ భరత్‌రామ్‌దిగా ప్రచారం

ప్రమాదానికి కారణమైన కారు రాజమండ్రి ఎంపీ భరత్‌రామ్‌దిగా ప్రచారం సాగుతోంది. ప్రమాదం జరిగిన సమయంలో ఆయన కారులోనే ఉన్నారని కొందరు, వెనుక కారులో ఉన్నారని కొందరు, అసలు ఆయన కారు కాదని ఆయన బంధువులదనే ప్రచారం సాగుతోంది. అయితే పోలీసులు మాత్రం దీనిని నిర్ధారించలేదు. ప్రమాదం జరిగిందని సమాచారం తెలుసుకున్న దెందులూరు ఎస్ఐ వీర్రాజు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదం జరిగిన వెంటనే కారును డ్రైవర్‌కు అప్పగించి కారులోని వ్యక్తులు వేరే కారులో వెళ్లిపోయారు. పోలీసులు ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌ని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రమాదానికి కారణమైన కారు

యల్లాప్రగడ సుబ్బారావు పేరును ఎయిమ్స్‌కు పెట్టాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రపంచ వైద్య శాస్త్ర పరిశోధకులు, భీమవరం పట్టణ వాసి డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు వైద్య పరిశోధనలు అనన్య సామాన్యమైనవని, ఆయన భీమవరంలో జన్మించడం గర్వ కారణమని భీమవరం ఐఎంఎ అధ్యక్షులు పి.బాలకృష్ణ అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా పట్టణంలో డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు పేరును అమరావతిలోని ఎయిమ్స్‌కు పెట్టాలని పరిశీలిస్తున్నారని తెలిపారు. విదేశాలలో సైతం డాక్టర్ యల్లాప్రగడకు గుర్తింపు ఉందని, భావితరాల్లో ఇటువంటి వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలని, ఈ నేపథ్యంలో అమరావతిలోని ఎయిమ్స్‌కు యల్లాప్రగడ సుబ్బారావు పేరును నామకరణం చేయాలని ఐఎంఎ తరపున కోరుతున్నామని తెలిపారు. పి.బాలకృష్ణంరాజు మాట్లాడుతూ ఆయన పేరు ఎయిమ్స్‌కు పెట్టడం సంపూర్ణ న్యాయమన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. కార్యక్రమంలో అరసవల్లి సుబ్రహ్మణ్యం, నందమూరి రాజేశ్ పాల్గొన్నారు.

16 నుంచి రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకూ యూత్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ మీట్ బాల బాలికల కవురు శ్రీనివాస్ కప్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, మాంటిస్సోరి విద్యా సంస్థల ఛైర్మన్ మద్దాల వాసు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు పాలకొల్లు మండలం ఉల్లంపర్రు మాంటిస్సోరి స్కూల్ గ్రౌండ్‌లో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ ఫ్లడ్ లైట్ వెలుగులో జరుగుతాయని పేర్కొన్నారు. ఈ పోటీలను జిల్లా ప్రయివేట్ స్కూల్స్ యాజమాన్య సంఘం నిర్వహిస్తోందని, క్రీడాకారులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

నేడు 22వ వార్డులో 'గడపగడపకు..'

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలోని 22వ వార్డులో ఈ నెల 13వ తేదీ శనివారం నిర్వహించే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు వైసిపి రాష్ట్ర, జిల్లా, పట్టణ, మండల నేతలు, పార్టీ వార్డు, అధ్యక్ష కార్యదర్శులు, గ్రామ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొనాలని జెడ్‌పి ఛైర్మన్ కార్యాలయ సిబ్బంది తెలిపారు.

గర్భిణులు, బాలింతలకు పరీక్షలు

ప్రజాశక్తి - గణపవరం

గ్రామంలో ప్రతి వారమూ 104 వాహనం ద్వారా ఉచితంగా అందించే మందులు తీసుకుని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిప్పర ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం డాక్టర్ కె.శ్రీయాంక. అన్నారు. శుక్రవారం కాశిపాడులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, షుగరు, బిపి పరీక్షలు నిర్వహించారు. వారందరికీ ఉచితంగా మందులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు నామాల రాజు, ఎఎన్.ఎం.శివకుమారి, ఆశాలు కృష్ణకుమారి, వాలంటీర్లు పాల్గొన్నారు.

రైతు యాత్రకు తరలిన టిడిపి నేతలు

ప్రజాశక్తి - ఆకివీడు

టిడిపి తలపెట్టిన పోరుబాట యాత్రలో భాగంగా పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు తణుకులో చేపెట్టిన రైతు యాత్రకు ఆకివీడు నుంచి ఆ పార్టీ నేతలు తరలి వెళ్లారు. శుక్రవారం ఉదయం స్థానిక మండల పార్టీ కార్యాలయం వద్ద నుంచి సుమారు 50 మంది కార్యకర్తలు సొంత వాహనాలపై తరలి వెళ్లారు. పట్టణ అధ్యక్షులు గంధం ఉమా సత్యనారాయణ అధ్యక్షతన వీరి వెళ్లారు.

13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జడ్జి సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 13న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామగోపాల్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం కోర్టు ఆవరణలోని న్యాయ సేవాధికారి సంస్థ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో ఇప్పటివరకు 6,514 పెండింగ్ కేసులను, అలాగే 2097 ప్రీ లిటిగేషన్ కేసులను గుర్తించినట్లు చెప్పారు. జాతీయ లోక్‌అదాలత్‌కు సంబంధించి పోలీసు, న్యాయవాదులు, వివిధ ప్రభుత్వ అధికారులు, ప్రజలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 50 సమావేశాలు నిర్వహించామని తెలిపారు. లోక్‌అదాలత్‌కు సంబంధించి జిల్లాలో 31 బెంచ్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ అదాలత్‌లో రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులు, అన్ని రకాల సివిల్, వాహన ప్రమాద బీమా, చెక్‌బౌన్స్, కుటుంబ వివాద, మున్సిపల్ ట్యాక్స్, చిట్‌ఫండ్ కేసులు, అలాగే కోర్టు ముందుకు రాని బ్యాంకు లావాదేవీల కేసులు, విద్యుత్ బకాయిలు, టెలిఫోన్ బకాయిలు మొదలైనవి ప్రీలిటిగేషన్ కేసులుగా రాజీ చేస్తామని చెప్పారు.

పాస్‌పోర్టు పోయినది

VISWANADHAPALLI KANAKA RAJU అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది. 04-02-2020న **U6953439** నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసారు. సదరు పాస్‌పోర్టు జిరాక్సు కాపీలు తీయించుకునేందుకు మా ఇంటి నుండి మొగల్తూరు వెళ్తుండగా నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన, నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

VISWANADHAPALLI KANAKA RAJU
S/o. Viswanadhapalli Pothuraju
D.No. 7-88, Kothadindla
Pallavapalem, Perupalem Post
Mogaltur Mandal
West Godavari Dist., A.P.,